# శిక్ష

★ అనిల్ ఎస్. రాయల్

బొమ్మలు : అక్బర్



***ఆ రోజు- అన్ని రోజుల్లాగే భళ్ళున తెల్లారింది.***

***ఏడున్నరకే ఎండ ఫెళ్ళున కాస్తున్నది. వడగాలి ఛెళ్ళుచెళ్ళున కొడుతున్నది.***

***రహదారి మీద రద్దీ మామూలుగానే ఉంది. రాజధాని నగరంలోకి పోతుందా నల్లతాచు లాంటి తారోడ్డు. ఒకప్పుడదో కంకర్రోడ్డు. దానికి ఇరువైపులా తుప్పలూ తుమ్మలూ, రప్పలూ రాళ్ళూ తప్ప మరోటి ఉండేవి కాదు. అది ఇరవయ్యేళ్ళ నాటి మాట.***

ఇరవయ్యేళ్ళలో తరం మారింది. లోకం మారింది. దాని పోకడ మారింది. బడులు మారాయి. పలుకుబడులు మారాయి. రాజధాని నుండి నాగరికత పాక్కుంటూ అక్కడిదాకా వచ్చేసింది. తుప్పల, రప్పల స్థానంలో ఇళ్లూ, గుళ్లూ మొలిచాయి. జనాన్ని నగరం నడిబొడ్డుకి రవాణా చెయ్యడానికి బస్సులూ, అవి ఆగడానికో స్టాపూ, దాన్నానుకునో దుకాణాల సముదాయమూ, అలా అలా ఒకదాని వెంబడి ఒకటి వచ్చేశాయి. అక్కడున్న ప్రతి భవనం నెత్తిమీదా కిరీటాల్లా భాసిస్తూ భారీ హోర్డింగులు వెలిశాయి. వాటిలో సింగారాలు చిలికిస్తూ చీరలమ్మే కథా నాయికలవి కొన్ని, దరహాసాలొలికిస్తూ బంగారాన్నమ్మే కథానాయకులవి కొన్ని, ర్యాంకుల టముకేస్తూ సీట్లమ్మే కార్పొరేట్ బళ్ళవి తక్కినవన్నీ. చదువుకొనే కాలమెప్పుడో కాలం చేసి చదువు'కొనే' కాలానికి దారిచ్చేసింది. కాబట్టి ఈ మూడో రకం కిరీటాలదే అక్కడ ఆధిపత్యం.

నాగరికతతో పాటు బిలబిలమంటూ నేరాలూ విచ్చేశాయక్కడికి. వాటిని నియంత్రించడానికో రక్షకభట నిలయమొచ్చింది. బస్టాపు పక్కనే కొలువయిందది. ప్రజల నుండి రక్షణ కోసం చుట్టూ ఎత్తయిన ప్రహరీగోడ, పైన కరెంట్ తీగలు, స్ట్రాటజిక్ లొకేషన్స్‌లో వ్యూహాత్మకంగా పేర్చబడ్డ ఇసుక మూటలు, సెంట్రీ బురుజులు, ఇతరత్రా హంగామాతో దర్జాగా నిలబడుందది. కోట ముందు కందకంలా దాని ముందో మురుగు కాల్వ. అందులో మొసళ్ళు లేనిలోటు తీరుస్తూ ముళ్ళకంపలు, కుళ్ళు కంపు. మొత్తమ్మీద ఆ ఠాణా ఓ అభేద్య దుర్గం.

అదిగదిగో ఆ దుర్గం ముందు ప్రస్తుతం ఓ పోలీస్ జీపు ఆగుంది. అరగంట నుండి అదక్కడే ఉంది. దాని ముందు సీట్లో డ్రైవరుడు లేడు. పోయేది ప్రజల సొమ్మే కాబట్టి బండి ఇంజన్ రన్నింగ్‌లో వదిలేసి పక్కనున్న టీ బడ్డీ దగ్గర ఫ్రీ టీ సర్రుసర్రున జుర్రుతూ పిచ్చాపాటీ కబుర్లతో కాలక్షేపం చేస్తున్నాడు. ఆ బడ్డీ ముందున్న దండెమ్మీద ఎన్ని పాన్‌పరాగ్ దండలు వేలాడుతున్నాయి, కౌంటర్ మీద పడున్న సకుటుంబ సపరివార పత్రిక అట్టమీద ఐటమ్‌గాళ్ ఒళ్ళెట్టా విరుచుకుంటున్నది, బడ్డీ పక్కనున్న స్వతంత్ర భారత్ వైన్స్ ముందు టాక్స్ పేయర్స్ ఎలా పడిగాపులు పడుతున్నారు, వైన్స్ వెనకున్న మురిగ్గుంటలో సేదదీరుతున్న పందిరాజములు ఎంత ముద్దొస్తున్నాయి... వగైరా వాతావరణ నివేదికలిచ్చేంత సమయం లేదు. అవతల బస్సొచ్చే టైమైంది. నిజానికి డ్రైవర్ మేటరూ అనవసరమే. ఈ కథలో వచ్చిపోయే సవాశేరు పేరులేని ఎక్స్‌ట్రా పాత్రల్లో అదొకటి. కథకి వాతావరణం కల్పించే వంకతో ఇలాంటి పోసుకోలు కబుర్లు రాసి పుంఖాలు నింపే వెసులుబాటు కథకులకుంది కాబట్టి రాయటమే.

డ్రైవర్నక్కడే వదిలేసి మళ్ళీ జీపులోకి తొంగిచూస్తే- వెనుక సీట్లో ఇద్దరు పక్కపక్కన కూర్చున్నారు. వాళ్ళల్లో ఒకడు రెండోవాడి కుడి చెయ్యి పట్టుకుని ఉన్నాడు, వదిలేస్తే ఎక్కడ పారిపోతాడోనన్నట్లు. వాడి ముఖంలో అధికారం తెచ్చిపెట్టిన ధీమా కనిపిస్తుంది. తొడుక్కున్న ఖాకీ దుస్తులు ఆ దర్పాన్ని తొడగొట్టి ప్రకటిస్తున్నాయి. మామూలుగానైతే ఖాకీ దుస్తుల మనిషి సెక్యూరిటీ గార్డు కావచ్చు, బిఎస్ఎఫ్ జవాను కావచ్చు, కే. బాపయ్య లాంటి పాతకాలపు సినిమా దర్శకుడూ కావచ్చు. కానీ పోలీస్ జీపులో ఒకడ్ని పారిపోకుండా గాఠిగా పట్టేసుకుని కూర్చున్న ఖాకీదుస్తుల అధికార ముఖపోడు మాత్రం వాళ్ళెవరూ కాకుండా పోలీసన్నే అయ్యుండాలి. దీన్నే 'పరిస్థితులు కల్పించిన సాక్ష్యాధారాలు పరిశీలించిన పిమ్మట'' అంటారు. ఇంగ్లీషులో చెప్పాలంటే 'సర్కమ్‌స్టాన్సియల్ ఎవిడెన్స్' అన్నమాట. ఈ సర్కమ్‌స్టాన్సియల్ ఎవిడెన్స్ అనేది మా చెడ్డది. చూసే కోణం కొంచెం మారిస్తే చాలు, కథ మొత్తం తిరగబడుద్ది. కాబట్టి దీని ఆధారంగా అంత తేలిగ్గా దేని మీదా ఓ నిర్ధారణకి వచ్చెయ్యకూడదు. కానీ వీడి విషయంలో మాత్రం ఎవిడెన్స్ తట్టుకోలేనంత గట్టిగా ఉంది కాబట్టి ఫరవాలేదు.

అధికార ముఖపు పోలీసన్ననీ, వాడి ఉడుంపట్టు వదిలించుకోటానికి మౌనంగా గింజుకుంటున్న రెండో వాడినీ మార్చి మార్చి చూస్తున్నది బస్టాపు ముందు నిలబడున్న కుర్రజంటొకటి. అదో ప్రేమపక్షుల జంట. అందులో ఆడపక్షి అష్టలక్ష్మి లాగుంటే, మగది అక్కుపక్షి లాగుంది. కిచకిచలాడుతూ మధ్యమధ్యలో జీపుకేసి చూస్తున్నాయా పక్షులు. ఆ కిచకిచలు సృష్టించిన ధ్వనితరంగాలు వాయువేగంతో జీపులో ప్రవేశించి పోలీసన్న కుడి చెవిలోంచి లోపలికి దూరి అందున్న శూన్యం గుండా ప్రయాణించి అవతలి చెవిలోంచి బయటపడి అదే ఊపులో రెండో వాడి కర్ణభలకాన్ని తాకుతున్నాయి. ఆ కిచకిచలతో ఈ రెండో వాడికి సమస్యలేదు కానీ వాటి మధ్య అడపాదడపా దొర్లుతున్న పకపకలతోనే యమ చిరాగ్గా ఉంది. బాధలో ఉన్నవాళ్ళకి పరుల సంతోషం కలిగించే చిరాకది.

ఈ చిరాకు ముఖం వాడి పేరు బండరెడ్డి. బండరెడ్డి పేరుకు తగ్గట్టుగా బండగా ఉన్నాడని రాయొచ్చు కానీ దానివల్ల ఎవరి మనోభావాలన్నా దెబ్బతింటే కొంపలు మునుగుతాయి. ఎంచక్కా కొంచెం బొద్దుగా ఉన్నాడంటే ముద్దుగానూ ఉంటుంది, ఓ హద్దులో ఉన్నట్లూ ఉంటుంది. కాబట్టి అలాగే అందాం. ఇకనుండీ మనం వీడి వెనకేబడదాం. ఎందుకంటే, ఇది వీడి కథ.

ప్రేమ పక్షులకి ఐదు నిమిషాల్లో కరిగిన అరగంట బండరెడ్డికి రెండు గంటల్లా నిక్కుతూ నీలుగుతూ నడిచింది. సరిగ్గా ఎనిమిదింటికి అల్లంత దూరాన రోడ్డు చివరి మలుపులో కనబడింది బస్సు. 'నిండు గర్భిణిలా' అనే ప్రయోగం చెయ్యటానికి వీల్లేకుండా రయ్ రయ్యిన దూసుకొచ్చి కీచుమనే శబ్దంతో ఆగింది. బస్టాపులో కాదు. అక్కడాగటానికది ఘనత వహించిన ఆం.ప్ర.రో.ర.సం వారి జన రవాణా బస్సు కాదు. కిటికీలకి పటిష్ఠమైన ఊచలు, ప్రమాదాల్ని తట్టుకునే దళసరి గోడలు- వెరసి అనుమతి లేనిదే బయటికీ లోపలికీ రాకపోకలు సాగించలేని పకడ్బందీ బందోబస్తున్న బస్సు. సరిగ్గా బండరెడ్డున్న పోలీస్ జీప్ ఎదురుగా ఆగింది. రెడ్డి బలవంతంగా ఎక్కించబడ్డాక కదిలింది.

రెడ్డి కాక పన్నెండు మంది పాసింజర్లు ఉన్నారందులో. అందరి ముఖాల్లోనూ దిగులు, భయం, బాధ కలగలిసిన నిర్వేదం. అందరూ మూగజీవులో లేక వాళ్ళ మధ్య మాటలు నిషేధించబడ్డాయో మొత్తమ్మీద పాసింజర్లందరూ ముఖాలు మాడ్చుకుని సీటుకొకరు చొప్పున తలా ఓ కిటికీ పక్కన కూర్చుని ఉన్నారు. ఎవరెటు చూస్తున్నా అందరి దృష్టీ శూన్యంలోనే లీనమౌతోంది. మొత్తమ్మీద బస్సంతా గంభీరభరితం. శ్మశానంలో ఇంతకన్నా ఎక్కువ సంతోషం తాండవిస్తుందేమో.

ఖాళీ సీటొకటి చూసుకుని కిటికీ పక్కన కూలబడ్డాడు రెడ్డి. భుజమ్మీద వేలాడుతున్న బరువైన సంచిని పక్క సీటులో విసురుగా పడేశాడు. కొన్ని మాడు ముఖాలు ఇటు తిరిగి, మళ్లీ అటు తిరిగాయి.

డ్రైవర్, పదమూడుగురు పాసింజర్లు కాక మరో మనిషున్నాడందులో. ఈ రోజున మన కళ్ళబడ్డ రెండో ఖాకీదుస్తుల మనిషి వీడు. ఓ చేతిలో దినపత్రిక, రెండో చేతిలో వెలుగుతున్న సిగరెట్ పట్టుకుని ఇంజన్ బాక్స్ మీద దిలాసాగా కూర్చుని ఉన్నాడు. మిలటరీ సర్వీసునుండొచ్చిన వాడు కావడంతో మేజర్ అంటారంతా. అనకపోతే తంతాడు. అందుకని అందరూ ముఖమ్మీద 'మేజర్' అన్నా వెనకాల 'వాడు', 'వీడు' అనే అనుకుంటారు. మనమూ అదే చేద్దాం.

బండరెడ్డి కళ్ళు మేజర్ చేతిలో ఉన్న సిగరెట్ మీద పడ్డాయి. అంటే రెడ్డి కళ్ళు వాడి తలకాయలోంచి ఊడొచ్చేసి సిగరెట్ మీద పడిపోయాయని కాదు. వాడి చూపులు సిగరెట్ మీదకి మళ్ళాయని. అక్కడ్నుండి ఆ పొగ వెంబడే పాక్కుంటూ పైకెళ్ళి పైనున్న 'నో స్మోకింగ్' కంకాళం బొమ్మ మీద ఆగి, యూ-టర్న్ తీసుకుని మళ్ళీ కిందికి జరజరా పాక్కుంటూ వచ్చి మేజర్ ముఖమ్మీద వాలాయి. సరిగ్గా బండరెడ్డి చూపులు తన ముఖమ్మీద వాలే సమయానికి దినపత్రిక మడిచి పక్కన పడేస్తూ కనుకొనల నుండి రెడ్డిని పరికిస్తూ గరగరలాడే గొంతేసుకుని డ్రైవర్‌తో చెబుతున్నదా ముఖం:

''...ప్రేమించలేదని డిగ్రీ స్టూడెంట్ ముఖమ్మీద యాసిడ్ పోసిన కేసు. ఏడేళ్ళు శిక్ష.''

''ఏడేళ్ళేం సరిపోద్ది. ఉరి తీయాలి వెధవలను'' డ్రైవర్ స్పందన. మెల్లిగా అన్నా రెడ్డి చెవుల్లో పడింది. వాడి మనసు చివుక్కుమంది.

ఘోరమైన శిక్షలతో నేరాలు మాయమౌతాయనుకునే సగటుజీవి ఆ డ్రైవరు. పిల్లల్ని పందెం కోళ్ళలా పెంచే తల్లిదండ్రులు మారితే తప్ప గెలుపోటములు తేలిగ్గా తీసుకునే తత్వం కుర్రకుంకల తలకెక్కదన్న జ్ఞానం బొత్తిగా లేని మామూలు మానవుడు. అయితే రెడ్డి మనసు చివుక్కుమంది ఆ అజ్ఞానానికి కాదు. 'ఉరి' అన్న మాట తవ్వితీసిన జ్ఞాపకానికి. మెదడు పొరల్లో ఎంత లోతుగా పాతరేసినా ఏదోలా బయటపడి పోతుందది. దాని బారి నుండి తప్పించుకునే ప్రయత్నంలో, పారిపోయే ఉపాయాల మీదకి మనసు మరల్చాడు. పారిపోవటం తనకి కొత్త కాదు. దొరికిపోవటమూ కొత్త కాదు. గతానుభవాల దృష్ట్యా, ఇక ముందు తన మీద నిఘా మరింత కట్టుదిట్టంగా ఉండబోతుంది. ఎలాగో మళ్ళీ పారిపోయినా ఎక్కడికెళ్ళాలి? పోనీ... పారిపోయే ఆలోచనకి స్వస్తి చెప్పి ఏదోలా మిగిలిన ఆరేళ్ళు నెట్టుకొచ్చేస్తే? ఆ నరకంలో ఒక్క ఏడాదే యుగంలా గడిచింది, ఇంకో ఆరేళ్ళన్న ఊహే భయంకరంగా ఉంది.

మేజర్ బాతాఖానీ సాగుతూనే ఉంది. అతని దృష్టి మాత్రం అప్పుడప్పుడూ రెడ్డి ముఖమ్మీద తారట్లాడుతూనే ఉంది. పేరున్నంత మొరటుగా బండరెడ్డి ముఖముండదు. అంతో ఇంతో అమాయకత్వమే కనిపిస్తుందందులో. కానీ రెడ్డి పైకి కనబడేంత అమాయకుడు కాదని మేజర్‌కి బాగా తెలుసు. గతేడాది రెండుసార్లు కాపలావాళ్ళ కళ్ళుగప్పి పారిపోబోయి రెండుసార్లూ మేజర్ చేతికే చిక్కాడు. డ్రైవర్‌తో హస్కు కొడుతున్నా, మేజర్ కళ్ళు పదేపదే రెడ్డి వైపు మళ్ళుతుండడం అందుకే కావచ్చు. ఆ చూపులు గుచ్చుకుంటుండడంతో రెడ్డి ఉష్ట్రపక్షిలా మారాడు. తల పక్కకి తిప్పి కిటికీలోంచి బయటికి చూడసాగాడు.

బస్సు జిల్లా పరిషత్ హైస్కూల్ ముందుగా, ఎడాపెడా రోడ్డు దాటేస్తున్న విద్యార్థినీ విద్యార్థుల్ని నేర్పుగా తప్పుకుంటూ నెమ్మదిగా వెడుతోంది. ఒకట్రెండు తరాల కింద హైస్కూలు చదువులంటే ఎక్కువ మందికి అలాంటి బళ్ళే దిక్కు. ప్రస్తుతం అదో దిక్కుమాలిన బడి. ఐనా దాని డిమాండ్ దానికుంది కాబట్టి విద్యార్థులకైతే కరువు లేదు.

రెడ్డి చూపు బడి ప్రాంగణంలోకి ప్రసరించింది. దాన్నిండా సీతాకోకచిలకల్లాంటి స్కూలు పిల్లలు. బడి ముందున్న విశాలమైన మైదానంలో నవ్వుతూ, తుళ్ళుతూ రకరకాల ఆటల్లో మునిగి తేలుతున్నారు. గోలగోలగా ఉంది అక్కడంతా. స్వేచ్ఛావిహంగాల్లా ఉన్నారు వాళ్లంతా.

మనలో మాట. ఏదో కవితాత్మకంగా ఉంటుందని స్వేచ్ఛావిహంగం అంటామే కానీ నిజానికి పక్షులకి స్వేచ్ఛ ఎక్కడేడిచింది. పొద్దెక్కినప్పట్నుండి పొద్దుగుంకేదాకా తిండిగింజల కోసం తిప్పలు పడడం, ఎవరదిలించినా దడుచుకు పారిపోవటం... బతుకంతా అదే భయం. అదేం స్వేచ్ఛ!

పై మనలో మాట బండరెడ్డికి తెలీకపోవటంతో... సదరు స్వేచ్ఛావిహంగాలు కళ్ళబడేసరికి వాడి గొంతులో ఏదో అడ్డం పడ్డట్లయింది. మరీ దూరం కాని గతంలో తానూ అటువంటి ఓ స్వేచ్ఛాజీవే. ఆ పిల్లల భాగ్యానికి అసూయ, తన దౌర్భాగ్యానికి కోపం ఏక కాలంలో కలిగాయి రెడ్డికి. వాళ్ల మీదనుండి చూపు మరల్చుకుంటూ కళ్ళు మూసుకున్నాడు. ఆ కళ్ళ ముందు కింద టేడాది గిర్రున తిరిగింది. ఏడాదిగా తప్పించుకోవడానికి రెడ్డి చేయని ప్రయత్నాల్లేవు. అర్జీలు, రికమెండేషన్లు, ఏవీ పని చెయ్యలేదు. రెడ్డి మొర ఆలకించేవారే లేకపోయారు. పారిపోయే ప్రయత్నం రెండుసార్లూ బెడిసికొట్టింది. నిరాహార దీక్షతో పనవుతుందేమోనని గత వారం అదీ ప్రయత్నించి చూశాడు. అన్నాహజారే అన్నం తిననంటూ మొండికేస్తే దేశం గగ్గోలెత్తిపోతుందేమో కానీ బండరెడ్డి తిండి మానేస్తే పట్టించుకునేదెవరు? నిరశనదీక్ష సైతం నీరసంగా ముగిశాక ఇక మార్గాలేవీ మిగల్లేదు.

బస్సు కంటోన్మెంట్ ఏరియాలోకి ప్రవేశించింది. ట్రాఫిక్ పెద్దగా లేదు. రోడ్లు ఖాళీగా ఉండడంతో బస్సు వేగం పెరిగింది.

ఐదు నిమిషాల తర్వాత, ట్రాఫిక్ సిగ్నల్ వద్ద బస్సాగింది. వైరాగ్యంలో మునిగున్న (మిగతా 12 పేజీలో)

**అదో ప్రేమపక్షుల జంట. అందులో ఆడపక్షి అష్టలక్ష్మి లాగుంటే, మగది అక్కుపక్షి లాగుంది. కిచకిచలాడుతూ మధ్యమధ్యలో జీపుకేసి చూస్తున్నాయా పక్షులు. ఆ కిచకిచలు సృష్టించిన ధ్వని తరంగాలు వాయువేగంతో జీపులో ప్రవేశించి పోలీసన్న కుడి చెవిలోంచి లోపలికి దూరి అందున్న శూన్యం గుండా ప్రయాణించి అవతలి చెవిలోంచి బయటపడి అదే ఊపులో రెండో వాడి కర్ణభలకాన్ని తాకుతున్నాయి.**

# శిక్ష...

రెడ్డి కిటికీ పక్క పెద్ద శబ్దమై కళ్ళు తెరిచి చూశాడు. మిలటరీ ట్రక్కొకటి, డ్రైవర్ ఆఖరి క్షణంలో బ్రేక్ వేయడంతో, కీచుమని శబ్దం చేస్తూ ఆగిపోయింది. దాన్నిండా జవాన్లు. తిరిగొస్తారో రారో తెలీని ఏ ఇతర కార్యమ్మీద బయల్దేరారో– అందరి ముఖాల్లోనూ అదోరకం ఆందోళన... చావు భయం. జ్ఞాపకం మళ్ళీ ఒళ్ళు విరుచుకుంది. దాన్ని కప్పెట్టేయడానికి రెడ్డి కుస్తీ పడుతుండగా, సిగ్నల్ మారింది. వాహనాలు రెండూ ముందుకురికాయి. మిలటరీ ట్రక్కు హారన్ మోగించుకుంటూ హడావిడిగా దూసుకుపోయింది. అదలా వెళ్ళిందో లేదో, ఆ ఖాళీని పూరించడానికన్నట్టు ఆ స్థానంలోకి మరో వాహనం వచ్చి రెడ్డి బస్సుకి సమాంతరంగా ప్రయాణించసాగింది. ముదురు బూడిద రంగు బస్సు. రెడ్డి బస్సుల్లానే ఊచలు, దళసరి గోడలు ఉన్నాయి దానికి. పక్కన పెద్ద పెద్ద అక్షరాల్లో 'కేంద్ర కారాగారము' అని రాయబడి ఉంది. కిటికీల దగ్గర అక్కడొకటీ ఇక్కడొకటీ కనిపిస్తున్నాయి నిర్లిప్తంగా చూస్తున్న ముఖాలు. యావజ్జీవిత ఖైదీలో లేక... ఉరిశిక్ష కోసం ఎదురుచూసేవాళ్ళో... మొత్తానికి అందరూ జీవన్మృతుల్లా ఉన్నారు. అందరి ముఖాల్లోనూ ప్రేతకళ.

రెడ్డికి ఆ ముఖాల్లో శీను కనపడ్డాడు.

కుస్తీలో జ్ఞాపకమే నెగ్గింది.

శీను...

'పిరికివాడు శీను' అన్నారందరూ. బండరెడ్డి దృష్టిలో మాత్రం శీను బహు ధైర్యవంతుడు. తానూ అదే పని చేయాలని రెడ్డి అప్పుడప్పుడూ ఆలోచించకపోలేదు. కానీ ధైర్యం చాలక ఆగిపోయాడు.

బతకటానికే కాదు, చావటానికీ ధైర్యం కావాలి మరి. రెండో దానికే రవ్వంత ఎక్కువ అవసరం.

శీనుతో రెడ్డికి పెద్దగా పరిచయం లేదు. శీను ఎవరితోనూ కలిసేవాడు కాదు. రెడ్డికన్నా రెండేళ్ళు పెద్దవాడు. సహచర బందీ; ఇప్పుడు కాదు. ఇప్పుడు లేడు కదా. తప్పించుకోవటానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమై నిస్పృహతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది మూడు నెలల కిందటి సంగతి. అప్పట్లో ఆంధ్రదేశమంతా పెద్ద సంచలనం. అదే అదనుగా దేశంలో మంటగలిసిపోతున్న మానవ హక్కుల దగ్గర్నుండి, భారతీయ సంస్కృతిపై పాశ్చాత్యుల దాడుల దాకా ఏవేవో విషయాలపై సాధారణ ప్రజానీకానికి అర్థం కాని భాషలో వాదోపవాదాలు చేసుకుంటూ మేధావులు టెలివిజన్లలో చెలరేగిపోయారు. టీవీ తొంభై తొమ్మిది వారు హుటాహుటిన దీనిపై ఎన్నారైల అభిప్రాయం ఆరా తీసి ఆంధ్రప్రదేశమంతటా దండోరా వేశారు. శీను పుట్టింది ఫలానా ప్రాంతంలో అని తెలియగానే విషయానికి రాజకీయ రంగంటుకుంది. శీను అమరవీరుడైపోయాడు. నాలుగు ఆర్టీసీ బస్సులు అగ్నికి ఆహుతయ్యాయి. సంబంధిత శాఖ మంత్రిని ఊడబెరకాలంటూ అసెంబ్లీలో విపక్ష నాయకులు ఊగిపోయారు. జైళ్ళు–బళ్ళ జంట శాఖల్ని రెండేసి కళ్ళలా కడు సమర్థంగా కాచి కాపాడుకుంటున్న మంత్రిగారు కళవళపడిపోయారు. ఆ కళ్ళలో ఒకటున్నా ఊడబెరికి తనకప్పగించకపోతుందా హైకమాండ్ అనుకుంటూ ఆయాసపడింది ఆశావహుల జాబితాలో సదా ఘస్టుండే సీనియర్ మోస్టు చకోరపక్షి. ప్రతిపక్షంపై అలవాటుగా ఎదురుదాడికి దిగింది పాలక పక్షం. సందట్లో సడేమియాగా ప్రభుత్వాన్ని పడగొడతామంటూ తొడగొట్టింది చీలిక పక్షం. అదే జరిగితే మద్దతిచ్చి ఆదుకుంటామంటూ అడక్కపోయినా అభయమిచ్చిందో పిపీలిక పక్షం. మొత్తమ్మీద రాష్ట్రమంతా రంకెలూ రణగొణధ్వనులూ. వారం పాటు మీడియా మెదళ్ళకి ఇదే మేత. పాఠకులకీ ప్రేక్షకులకీ మోగిందే మోత. ఎనిమిదో రోజు జరిగిందా సంఘటన. దేశాన్ని పట్టి కుదిపేసిన ఘటన.

అవినీతి, ఆర్థిక మాంద్యం, ధరవరలు, కరువు కాటకాలు, నిరుద్యోగం, అంటువ్యాధులు వంటి విషయాలు మరే దేశంలోనన్నా అంతర్యుద్ధాలకి దారితీసేంత పెద కారణాలవ్వొచ్చు కానీ మన దేశంలో కావు. మన మనసుకి పట్టేది రెండే విషయాలు. ఒకటి క్రికెట్. రెండోది సినిమా. ఆ రెండో రంగంలో ధృవతారగా వెలుగుతున్న నంబర్ వన్ కథానాయిక నెలతప్పిందనే వార్త దేశమంతా దావానలంలా వ్యాపించడంతో మేధావుల చర్చలు అటు మళ్ళాయి. ఆమెకి పుట్టబోయేది అమ్మాయా, అబ్బాయా లేక చెరొకరా; బిడ్డకి తల్లి పోలికలొస్తాయా, తండ్రివొస్తాయా లేక మరెవరివో వస్తాయా... ఇత్యాది ముఖ్యమైన అంశాలపై మీ అభిప్రాయాలు వెంటనే ఫలానా నెంబర్‌కి ఎస్సెమ్మెస్ పంపమనే ఆసక్తికరమైన పోటీలతో ఛానళ్ళు నిండిపోయాయి. మీడియా కవరేజ్ పోగానే రాజకీయులు ఎక్కడివారక్కడే గప్‌చుప్ సాంబార్‌బుడ్డి. అమరవీరుడి సంగతి అందరూ మర్చిపోయారు; రెడ్డి తప్ప.

ఎలా మరిచిపోగలడు? కళ్ళు మూసినా, తెరిచినా ఉరితాడుకు వేలాడుతున్న శీను శవమే కనిపిస్తుంటే. నాలుక వెళ్ళబెట్టి, కళ్ళు పొడుచుకొచ్చి, గాల్లో ఊగుతూ... జీవితాంతం వెంటాడే భయానక దృశ్యం.

పక్క బస్సు పాసింజర్ల మీంచి బలవంతాన దృష్టి మరల్చుకున్నాడు రెడ్డి. బస్సంతా ఓసారి కలయజూశాడు. గమ్యం దగ్గరౌతున్న కొద్దీ బస్సులో వైరాగ్య వాతావరణం ముదురుతోంది. ప్రయాణికుల మధ్య నిశ్శబ్దం. దాన్ని భగ్నం చేస్తూ బస్సు ఇంజన్ మోత. దానిలో కలిసిపోయిన మేజర్, డ్రైవర్ల సంభాషణ.

చావు మీంచి, శీను మీంచి ఆలోచనల్ని మళ్ళించే ఉద్దేశంతో చెవులు రిక్కించి వినడానికి ప్రయత్నించాడు రెడ్డి.



వేసవి సెలవులైపోయి స్కూళ్ళు తెరుచుకునే రోజుల్లో పిల్లలున్న తల్లిదండ్రుల మధ్య జరిగే సాదాసీదా సంభాషణ అది.

''మీవాడు ఈ ఏడాది ఇంటర్‌లోకొస్తాడు కదూ. ఎక్కడ చేర్పిస్తున్నావు?'' మేజర్ ప్రశ్న. ఎక్కడ చేర్పిస్తే వీడికెందుకో. వీడేమన్నా ఫీజులు కడతాడా పెడతాడా.

''గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో'' డ్రైవర్ సమాధానం.

''అదేం శార్వరిలో చేర్పించొచ్చు కదా'' మేజర్ ఉచిత సలహా.

''చేర్పిద్దామనే ఉంది. బయటైతే క్రికెట్టనీ, ఇంకోటనీ చెడిపోతున్నాడు. వాటికి తోడు మ్యూజిక్ పిచ్చొకటి. ఇంట్లో ఉన్న కాసేపూ ఆ గిటారొకటి తగిలించుకుని ఒకటే మోత. అవన్నీ కూడు పెట్టేవా చచ్చేవా, శార్వరిలో అయితే బాగానే ఉంటది కానీ అంత ఖర్చు తట్టుకునే స్తోమత నాకేడిది? పైగా స్టూడెంట్సందరూ హాస్టల్లోనే ఉండాలనే కండిషన్. అదింకో ఖర్చు. ఒక్కడి సంపాదనే కదా. ఓపక్క పెద్దల్లుడి కట్నం పీడింపులు. ఇంకో పక్క ముసలాళ్ళ మందులూ మాకులూ...'' డ్రైవర్‌లో నిద్రాణంగా ఉన్న దిగువ మధ్యతరగతి మానవుడు అదను దొరగ్గానే దిగ్గున మేల్కొని సినిమాటిక్ కష్టాల కథాకళి మొదలెట్టాడు.

''మన సారుతో ఓ మాట చెప్పిస్తే కన్సెషనిస్తారు కదా'' కథకళికడ్డొస్తూ మేజర్ డిస్కొంట్ ఆఫర్– అదేదో తానే ఇస్తున్న ఫోజుతో.

రెడ్డికి ఆసక్తి పోయింది. చూపులు బయటికి మళ్ళించాడు. ప్రేతకళ ఖైదీల వాహనం ఎప్పుడు వెనకబడిందో గమనించలేదు.

రోడ్లమీద రద్దీ లేకపోవడంతో బస్సు వేగంగా వెళుతోంది. అల్లంత దూరంలో రోడ్డునానుకుని కేంద్ర కారాగారం కనిపిస్తున్నది. అంటే... గమ్యం దగ్గర పడిందన్న మాట. రెడ్డి మనసులో ఇంకా సంఘర్షణ, 'తప్పించుకోటమా, తక్కిన రోజులు అక్కడే గడపటమా?'

తేల్చుకునేలోపల బస్సు జైలు భవనాన్ని సమీపించింది. దాని వేగం తగ్గింది. రెడ్డి కళ్ళు మూసుకున్నాడు.

బస్సు మెల్లిగా జైలు ప్రధాన ద్వారాన్ని దాటి ముందుకెళ్ళి రోడ్డు దిగింది. అక్కడో పెద్ద ఆవరణ. చుట్టూ ఎత్తయిన ప్రహరీగోడలు. వాటిపైన ముళ్ళ తీగలు. గోడ మధ్యలో ఉన్న భారీ ఇనుపగేటు ముందు బస్సాపి హారన్ మోగించాడు డ్రైవర్. నిమిషం తర్వాత భారంగా తెరుచుకుందది. బస్సు మెల్లిగా లోపలికెళ్ళగానే మూసుకుంది. తలుపు వెనకున్న సెంట్రీ పోస్టులో ఇద్దరు కాపలా కాస్తున్నారు. ఆ పోస్టు దాటాక కుడివైపున్న ఖాళీ స్థలంలో ఆగింది బస్సు.

ఆ ఆవరణలో మూడు పొడుగాటి మూడంతస్తుల భవనాలున్నాయి. దగ్గర దగ్గరగా, గుర్రపునాడా ఆకారంలో కనిపిస్తున్నాయవి. నాడా కుడి ఎడమల ఉన్న భవనాలు చాచిన కబంధ హస్తాల్లా ఉన్నాయి. దూరంగా ఒకేలాంటి దుస్తులు ధరించిన జీవచ్ఛవాల సమూహమొకటి చేతుల్లో బొచ్చెల్లాంటివి పట్టుకుని వరుసలో వెళుతోంది. ఉదయం ఎనిమిదిన్నరవుతుందిగా, ఉపాహారం కోసమేమో, వాళ్ళ వెనకాలో వార్డెన్ నడుస్తున్నాడు. అక్కడ తప్ప మిగతా ఆవరణంతా నిశ్శబ్దంగా ఉంది. అంతటా యాంత్రికత. జీవితమ్మీద విరక్తి కలిగించేంత యాంత్రికత.

బస్సు ఆగిన కుదుపుకి కళ్ళు తెరిచాడు రెడ్డి. అప్పుడే బస్సు ముందు భాగంలో ఉన్న తలుపు కూడా తెరుచుకుంది. అందులోంచి మొదట మేజర్ దిగి పహరా కాస్తున్నట్టు నిలబడగా, పాసింజర్లు ఒక్కొక్కరే దిగటం మొదలుపెట్టారు. ఎదురుగా ఉన్న భవనంలోంచి ఇద్దరు వార్డెన్లు ఇటే వస్తున్నారు.

ఆఖర్న లేచాడు బండరెడ్డి. సంచీనందుకుని భుజానికి తగిలించుకున్నాడు. కిందకి దిగబోతూ చివరి మెట్టు మీద ఆగిపోయాడు.

రెడ్డి మదిలో సంఘర్షణ సద్దుమణిగిన క్షణమది. స్వేచ్ఛ గురించి మర్చిపోయి మిగిలిన ఆరేళ్ళు కిక్కురుమనకుండా అక్కడే గడపాలని నిర్ణయించుకున్న క్షణం.

నిర్ణయించుకున్నాక రెడ్డి మెట్లు దిగాడు.

అప్పటికే అక్కడికి చేరుకున్న వార్డెన్లు తాజా జీవచ్ఛవాలని వరుసలో అమరుస్తున్నారు. రెడ్డి వెళ్ళి చివర్లో నిలబడ్డాడు.

మేజర్ బస్సెక్కాడు. డ్రైవర్ ఇంజన్ స్టార్ట్ చేశాడు.

''మెట్టుపేట సబర్బన్ సీఐ బండ బసివిరెడ్డి గారబ్బాయి. సందిస్తే పారిపోతాడు జాగ్రత్త'' వార్డెన్లకి మేజర్ అప్పగింతలు పూర్తవకముందే కదిలిందా పసుపు రంగు బస్సు.

బండరెడ్డి గుండె నిండా గాలి పీల్చుకుని తల పైకెత్తి చూశాడు.

ఎదురుగా ఉన్న భవనమ్మీద పెద్ద అక్షరాలతో వెక్కిరిస్తూ కనపడిందా పేరు.

'శార్వరి రెసిడెన్షియల్ విద్యా సంస్థలు'

దానికిందే చిన్న అక్షరాలతో రాసుంది. 'మా ప్రత్యేకత: ఆరు నుండి పన్నెండు తరగతుల వరకూ అంతర్జాతీయ ప్రమాణాలతో కఠోరశిక్ష...'

అందులో ఆఖరి అక్షరం ఎగిరిపోయింది. ఎవరి గుండె మండిన ఫలితమో.

వార్డెన్ల అదిలింపుతో వరుస కదిలింది.

దీర్ఘంగా నిట్టూర్చి నీరసంగా ముందుకు నడక సాగించాడు పన్నెండేళ్ళ బండరెడ్డి.

ఆ రోజు– వాడు ఏడో తరగతిలో అడుగుపెట్టే రోజు.

..........................................

anil.s.royal@gmail.com

**మీడియా కవరేజ్ పోగానే రాజకీయులు ఎక్కడివారక్కడే గప్‌చుప్ సాంబార్‌బుడ్డి. అమరవీరుడి సంగతి అందరూ మర్చిపోయారు; రెడ్డి తప్ప.**

**ఎలా మరిచిపోగలడు? కళ్ళు మూసినా, తెరిచినా ఉరితాడుకు వేలాడుతున్న శీను శవమే కనిపిస్తుంటే. నాలుక వెళ్ళబెట్టి, కళ్ళు పొడుచుకొచ్చి, గాల్లో ఊగుతూ... జీవితాంతం వెంటాడే భయానక దృశ్యం.**

## V సినిమా పజిల్

నిర్వహణ : **యజ్ఞమూర్తి**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | ● | 3 |
| | ● | | ● | ● | 4 | |
| 5 | | | | | ● | |
| | ● | | ● | ● | 6 | |
| ● | 7 | | 8 | | | ● |
| ● | | ● | | ● | 9 | |
| 10 | | | | ● | | ● |

### అడ్డం

1. కృష్ణ హీరోగా, చిరంజీవి సైడ్ విలన్‌గా నటించిన చిత్రం (5)
4. 'మనోహరం'లో జగపతిబాబు జోడీ (2)
5. ఫైట్ మాస్టర్లయిన సోదరులు (5)
6. 'రక్తాభిషేకం'లో బాలకృష్ణ సరసన నాయిక (2)
7. చిరంజీవి 'అడవిదొంగ' అయితే, శోభన్‌బాబు '.....' (5)
9. 'నోట్‌బుక్' దర్శకుడు (2)
10. శేఖర్ కమ్ముల 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్'కి ఓ గేయ రచయిత (4)

### నిలువు

1. 'శ్రీకృష్ణ పాండవీయం'లోని 'ఛాంగురే బంగారు రాజా...' గీత రచయిత (4)
2. మురళీమోహన్, అంబిక జంటగా దాసరి నారాయణరావు చిత్రం (5)
3. 'ఓ భార్య కథ'లో నాయిక (4)
6. 'రామాయణంలో పిడకలవేట' దర్శకుడు (4)
7. వంశీ 'లేడీస్ టైలర్' హీరోయిన్ (3)
8. శారద, శ్రీప్రియ కలయికలో అక్కినేని సంజీవి రూపొందించిన చిత్రం (3)

### గత వారం జవాబులు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 ఓ | సీ | త | 2 క | థ | ● | 3 త |
| చి | ● | ● | ర్పూ | ● | 4 సీ | మ |
| 5 న | వ | భా | ర | తం | ● | న్నా |
| దా | ● | ● | దీ | ● | 6 ర | ● |
| 7 న | గ్మా | ● | 8 పం | చా | క్ష | రి |
| ● | ● | 9 దీ | ● | ● | రే | ● |
| 10 రా | ళ్ళ | ప | ల్లి | ● | 11 ఖ | డ్గం |